# అగణితమయిన నేర్పు అనుకూల పరిస్థితులు

• చురకల వీరవెంకట్రావు •

వ్రూ పరీక్షలు ప్రారంభం కావటానికి ఎన్నో రోజులు గడువు లేదు. నిద్ర మానుకుని అహో రాత్రాలూ పాఠ్యగ్రంధాలతో పోరాడుతున్న వారిలో నేనొకడినయినా పరీక్షలంటే నాకు భయం పోలేదు. గోపాలంమాత్రం పరీక్షలకూ తనకూ సంబంధంలేనట్టు నిర్భయంగా, నిర్లక్ష్యంగా తిరుగుతున్నాడు. అతను చదివేది మూడో సంవత్సరం కాబట్టి నాకంటే శ్రద్ధగా చదవాల్సింది, మే మిద్దరం కలిసి నా రూములో చదివే వాళ్ళం. ఈ మధ్య గోపాలం భోంచేసి రూముకు వచ్చి పక్కవేసి పడుకోవటం తప్ప అసలు పుస్తకాలవయిపే చూడకపోవడం చూస్తే విపరీతమయిన ఆశ్చర్యం కలుగసాగింది నాకు.

"నువు పరీక్షలకు రాదలచుకోలేదా గోపీ!" అనడిగా నొకరాత్రి.

"ఎందుకు రానూ! పదిహేను రూపాయలు దండగ చేస్తానేమిటి" అన్నాడు గోపాలం పరుపు మీద దొర్లుతూ.

"పదిహేను రూపాయలూ దండగ కాకుండా చూసుకోవడమే కాని ప్యాసయ్యే ప్రయత్నం లేదేమిటి?' అని ప్రశ్నించాను తీవ్రంగా.

"ఆ ప్రయత్నం నే చేయనక్కర్లేదు. నేను ప్యాసవుతానని జ్యోతిష్కుడు చెప్పాడు"అన్నాడు గోపాలం.

"నువు చదవకుండా ప్యాసవుతావని ధీమాగా చెప్పాడా జ్యోతిష్య శిఖామణి? అనడిగాను.

"అతను చెప్పలేదు. జ్యోతిష్యప్రకారం నేనెలాగూ ప్యాసవుతాను ఈ మధ్యన పుస్తకాలు చదివి బుఱ్ఱ చెడగొట్టుకోవటం దేనికీ'' అన్నాడతను.

నాకు గోపాలంమీద అపరిమితమయిన జాలి వేసింది. ఏమంటే కేవలం జ్యోతిషనిర్ణయాన్ని నమ్ముకుని ప్రయత్నం లేకుండా ఫలితంకొరకు ఎవడూ ఎదురుచూడడు. జ్యోతిష్ఫలాలకు విరుద్ధ ఫలితాలు కలగటం నే నెన్నోసార్లు చూశాను. ఇంతకూ జ్యోతిష్యమంటే నాకు నమ్మకం లేకపోగా దాన్ని నమ్ముకునేవాళ్ళను చూస్తే నాకు మితిలేని అసహ్యం. గోపాలానికి ఎన్నోవిధాల నచ్చజెప్పి చదివించాలని చూశాను. కాని అతను ససేమిరా చదవనన్నాడు.

... ... ...

పరీక్షాదినం రానేవచ్చింది. ఇవ్వబోయే ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు సాధ్యమయినంతవరకూ ఊహించుకుని సమాధానాలు వల్లించసాగారు విద్యార్థులు. గోపాలంమాత్రం నూతన వస్త్రాలంకృతుడై తాంబూలం వేసుకుని వేళకు వచ్చాడు స్కూలుకి. ఈ రోజున అతను మరీ ఆనందంగా వున్నాడు. భారహృదయంతో నేను హాల్లోకి వెళ్తే అతను నవ్వుముఖంతో ప్రశ్నాపత్రం అంది పుచ్చుకుంటున్నాడు.

పేపరు వ్రాశాక గోపాలం ప్రశ్నించాడు" "ఎన్ని మార్కులు వస్తాయ్?"

వెధవ యింగ్లీషు! ప్యాసుమార్కులు వస్తాయేమో. నీకో? అన్నాను.

"మనం ఎలాగూ ప్యాసవుతాం" అంటూ సాగిపోయాడు గోపాలం. అతని ఈ వింత ప్రవర్తనగూర్చి అనేక అనుమానాలు నాలో కలుగసాగినై, తను ఫెయిలవుతానని నిర్ధారణగా తనకు తెలిసివుండీ ప్యాసయ్యేట్టు చెప్పుకుని యిలా కృత్రిమాన దాన్ని అనుభవిస్తున్నాడేమోనని సమాధానపడ్డాను.

... ... ...

పరీక్షలవడం తరువాయిగాని సెలవలు గడవటం ఎంతసేపు? పేపర్లో పరీక్షా ఫలితాలు ప్రక




టింపబడ్డాయ్. పేపరు చూసేటప్పటికి నా తల పాతాళానికి కృంగిపోయినట్లయింది. పేపర్లో గోపాలం నెంబరుంది. నా నెంబరు లేదు. ఇదేదో నమ్మరాని కలగా తోచింది నాకు. ఆ క్షణంతో గోపాలంమీద నాకు చెప్పరాని అసూయ బయలుదేరింది.

మార్కులు తెలిసిన రోజునకాని గోపాలం దర్శనం కాలేదు నాకు. అతనే మార్కులు చూసి వస్తూ నాకు ఎదురయినాడు.

"ఒక్క మార్కులో నువు యింగ్లీషులో తప్పావోయ్" అంటూ నాపట్ల సానుభూతి ప్రకటించాడు గోపాలానికి స్కూలు మొత్తంమీద ఫస్టుమార్కువచ్చినట్టు వినేసరికి ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాను.

"ఈ పరీక్షల్లో నీ పాత్ర విచిత్రంగా వుందోయ్" అన్నాను మర్నాడు.

"నా కిన్ని మార్కులు వస్తాయనిగాని కనీసం నేను ప్యాసవుతాననిగాని నువ్వు అనుకోలేదు. అసలు సంగతేమిటంటే జ్యోతిష్యమ్మంటే నాకున్న గాఢ నమ్మిక నన్ను ప్యాసు చేసింది, దానికి తగ్గట్టుగా మా చుట్టం ఒకాయన మనకు వాచరుగా వచ్చాడు. పరీక్షలున్నన్నిరోజులూ ఆయన మా యింట్లో భోంచేశాడుకూడా. ఆయనే వీలయినంత జాగ్రత్తగా నేను కాపీ చేసుకునే ఏర్పాటు చేశాడు. ఇది యిప్పటివరకూ ఎవరికీ తెలియని చిదంబర రహస్యం. నా ప్రక్కవాడు హాజరు కాకపోవటంమూలాన ఈ రహస్యం బయలుపడేందుకు అసలే వీలు చిక్కలేదు. కాపీ కొట్టడంలో అగణితమయిన నేర్పుగల విద్యార్థులలో నేనొకణ్ణి గనక ఈ అవకాశాన్ని వృధాచేయలేదు" ఇలా అతను చెప్పకుపోతోంటే అడ్డంతగిలి:

"మీ బంధువు వాచరుగా వస్తాడని నీకు తెలుసా ?" అని ప్రశ్నించాను.

"తెలీదు. జ్యోతిష్ఫలితం ఏర్పడేందుకివన్నీ అనుకూల పరిస్థితులు. ఒక్క మాట చెపుతా విను: భగవంతుడియందు నిస్వార్థమయిన భక్తి ఎవడికుంటుందో వానికి భగవంతుడు తక్షణం కన్పించి తీరుతాడని ఎవరో భక్తుడన్నట్టు జ్యోతిష్యమందుండే నిష్కల్మషమయిన నమ్మిక మనకి ఫలితాన్ని చేకూరుస్తుంది. నా అనుభవాన్ని చూశావుగా !" అన్నాడు గోపాలం.